క్లుప్తంగా

18న 'మనూ'లో ఎగ్జిబిషన్-కమ్-సేల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ధనక్ బజార్-ఎగ్జిబిషన్-కమ్ సేల్ ను ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' లేడీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎం వనజ ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయం లేడీస్ అసోసియేసన్, ది సఫా ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో 18న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్వహిస్తామని వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ చేతుల మీదుగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ఆదివారం నాదబ్రహ్మోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శోభరాజు శిష్యురాలు దుర్గా సింధూర అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు కృష్ణ నిత్యపూజలివిగో, పొడగంటిమయ్య, నల్లనిమేని, నగవులు, నిజమని తదితర శ్లోకాలను, గీతాలను ఆలపించి అలరిచారు. అన్నమయ్యభావన వాహిని వ్యవస్థాపకురాలు శోభరాజు కళాకారులకు సంస్థ జ్ఞాపికలను అందజేశారు.

శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ సంబరాలు



శేరిలింగంపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిపి స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఈ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని, మళ్ళీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, శ్రీకళగోపాల్‌యాదవ్, రవియాదవ్, బస్వరాజ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేశ్వర్లు, సుభాష్, శ్రీనివాస్, మహేష్‌చారీ, సాయినందన్, లక్ష్మీ, సువర్ణ పాల్గొన్నారు.

ఒరిస్సా ఉత్కల్ మని గోపాబంద్ దాస్ జయంతి వేడుకలు

హఫీజ్‌పేట్: ఒరిస్సా ఉత్కల్ మని గోపాబంద్ దాస్ నాల్గవ జయంతి వేడుకలు, అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం చందానగర్‌లోని క్రిస్టల గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

ముగిసిన జోనల్ స్థాయి పోటీలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న 7వ జోనల్ స్థాయి ఆటల పోటీలు ఆదివారంతో ముగిశాయి. జోనల్ పరిధిలోని 14 గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు గురుకులాల రీజనరల్ కోఆర్డినేటర్ కళ్యాణి, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గురుకులాల రీజనరల్ కోఆర్డినేటర్ కళ్యాణి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

రూ.51 లక్షల నగదు, విదేశీ మద్యం స్వాధీనం

గచ్చిబౌలి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీలలో రూ.51 లక్షల నగదు, లక్ష రూపాయల విలువ చేసే ఇండియాలో తయారీ చేసిన విదేశీ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో 'దేవీ శరన్నవరాత్రి' ఉత్సవాలు ప్రారంభం

జై మాత....జైజైమాత'.....అమ్మవారి నామస్మరణతో అంతటా మార్మోగుతోంది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని 'దేవీ శరన్నవరాత్రి' ఉత్సవాలు ఆదివారం అంతటా ఆరంభమయ్యాయి. అంతటా గణపతి పూజలతో ఉదయం అర్చకుల మంత్రోచ్చారణలతో ఉత్సవాలను ప్రారంభించారు. శరన్నవారాత్రి ఉత్సవాల ప్రారంభ రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు.

– రాయదుర్గం



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ..



జీఏర్‌పక్వార్టర్స్‌లోని షోడశ రాజేశ్వరిమాత అలంకారం



గచ్చిబౌలిలోని అన్నపూర్ణాదేవి మాతకు భవానీ మాత అలంకారం



నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ మాతకు ప్రత్యేక పూజలు



రాయదుర్గం ఊరపోచమ్మ అమ్మవారి ఆలయంలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



రాయదుర్గంలోని ఊరపోచమ్మ దేవాలయంలో..



రాయదుర్గంలోని ఊరపోచమ్మ దేవాలయంలో ..



నానక్‌రాంగూడలో..

టికెట్ మనదే... బీఫామ్ మనదే



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్

కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి టికెట్ మనదే... బీ ఫామ్ మనదే, కాదని నిర్ణయం తీసుకుంటే బీఫామ్ నా శవంపై నుంచి వెళుతుందని కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. టీఆర్‌ఎస్ కంటే ఒక్క సీటు ఎక్కువగా యాదవ సామాజిక వర్గానికి ఇస్తానని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పారని ఆయన గుర్తు చేశారు. నేను రేసు గుర్రాన్ని, పార్టీ నా పై నమ్మకం ఉంచి టికెట్ ఇస్తుందని ఆయన కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహకారంలో ముందుకు సాగుతానని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



గచ్చిబౌలి: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుట్టినరోజు కావడంతో సీఎం ఆయనను అభినందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గం లో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి, ఎన్నికల సందర్భంగా పార్టీ విజయంపై నిరంతరం కష్టపడి పనిచేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని ముందుకు సమిష్టిగా సాగాలని, గతంలోని మెజార్టీని మించి ఎక్కువ మెజార్టీ సాధించడంపై దృష్టి పెట్టాలని కేసీఆర్ సూచించారని గాంధీ పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రజారంజకం



ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో-2023 ప్రజారంజకంగా సీఎం కేసీఆర్ రూపొందించారని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జోడించి రూపొందించిన మ్యానిఫెస్టోగా ఆయన అభివర్ణించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించి మళ్ళీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి బీమాఅని, అందరికీ సన్నబియ్యం, అసరా పెన్షన్లు పెంపు, దివ్యాంగుల పెన్షన్ల పెంపు, రూ.400 లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం మహిళలకు పెద్ద ఉపశమనమన్నారు. ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితి రూ.15 లక్షలకు పెంచడం, నగరంలో అదనంగా లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేయాలని నిర్ణయించడం అందరినీ ఆకట్టుకుంటోందన్నారు. రానున్న ఎన్నికల్లో వచ్చే అయిదేళ్ల కాలంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి ఏం చేయబోతున్నామని పూర్తి ప్రణాళికను వివరించారన్నారు.

అభివృద్ధి మా నినాదం.. సంక్షేమం మా విధానం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింత కొనసాగాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీని నిండు మనస్సుతో ఆశీర్వదించి, హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వెదిరి టౌన్ షిప్, హెచ్‌ఎంటీ కాలనీల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా వెదిరి కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. పదేళ్లలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో చేసిన ప్రగతిని వివరించారు. నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు కల్పన, రాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం పునఃప్రారంభం



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను పునఃప్రారంభిస్తున్న కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, సింధు ఆదర్శరెడ్డి

హఫీజ్‌పేట్: ఆభరణాల వ్యాపారంలో 'మలబార గోల్డ్ అండ్ డైమండ్స్' పారదర్శకత పాటిస్తుందని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డితో కలిసి ఆమె పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ఒకటి అని అన్నారు. షోరూములో వివిధ రకాల డిజైన్లతో ఆభరణాలు విస్తృత శ్రేణిలో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ సంస్థ రిటైల్ హెడ్ పి.కె.సిరాజ్, చందానగర్ స్టోర్ హెడ్ దీపక్‌కుమార్, సోమాజిగూడ స్టోర్ హెడ్ షరీఫ్, కూకట్‌పల్లి స్టోర్ హెడ్ షానిబ్‌కె, మహమ్మద్ అబ్దుల్ నజీర్, మేనేజ్‌మెంట్ సభ్యులు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



రామకృష్ణనగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



చందానగర్‌లో..



హఫీజ్‌పేట్‌లో ..

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: తెలంగాణ పూల జాతర, ఆడపడుచుల అపురూప పండుగగా పేర్కొనే బతుకమ్మ వేడుకలను కొనసాగుతున్నాయి. ఆదివారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని పలు కాలనీలు,బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో కూడా మహిళలు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆటపాటలతో ఆడుతూ, పాడుతూ ఘనంగా నిర్వహించారు. ఆడియో రికార్డింగులు పెట్టి బతుకమ్మ ఆడుతూ జరుపుకున్నారు.

శతాధిక వృద్ధురాలు పాలడుగు వెంకట్రామమ్మ కన్నుమూత



హఫీజ్‌పేట్: నాటి రోజుల్లో కమ్యూనిస్టు ఉద్యమానికి కోటలుగా పేరొందిన ప్రాంతాల్లో ఒకటైన గన్నవరం తాలుకా పెద్దఅవుటుపల్లి గ్రామంలో జన్మించిన శతాధిక వెంకట్రామమ్మ ఆదివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఆమె కన్నుమూశారు. ఆమె భౌతికకాయానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు పూలమాల వేసి నివాళ్ళర్పించారు.

యువత చూపు బీఆర్‌ఎస్ పార్టీ వైపు



బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: తెలంగాణ రాష్ట్ర యువత మొత్తం బీఆర్‌ఎస్ పార్టీ వైపు చూస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీలకి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంతా బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉందని, యువత పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కంటికి రెప్పలా చూసుకుంటానన్నారు. సీఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఆదర్శంగా తీసుకొని అందరు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరడం జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఖాళీ అయిపోయిందన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ పటిష్ఠతకు సైనికుడిగా పనిచేసి బలోపేతం చేయాలన్నారు. బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలన్నారు. ఆసరా, ఒంటరి మహిళా ఫించన్లు, కెసిఆర్ కిట్, కంటి వెలుగు, రైతు బంధు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు, మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలు వంటి అనేక గొప్ప సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కెసిఆర్ దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ జన్మదిన వేడుకలు



శుభాకంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా



కేక్ కట్ చేస్తున్న చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి, నాయకులు



బీఆర్‌ఎస్ నాయకులు రాజుయాదవ్, నాయకులు తదితరులు

గచ్చిబౌలి: ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆయన నివాసంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు, వ్యాపారులతో సందడి వాతావరణం నెలకొంది. అందరూ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం, పూలమొక్కలను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందిరికీ అందించారు.

హైటెక్స్ గ్రౌండ్స్‌లో గ్రీన్‌థాన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మాదాపూర్: ప్రతి రోజూ వ్యాయామం చేయడం, కనీసం 8 గంటలు నిద్రపోవడం వల్ల అందరికీ తప్పని సరిగా అవసరమని కిమ్స్ ఆసుపత్రి సీఎండి డాక్టర్ బి.భాస్కర్‌రావు తెలిపారు. మాదాపూర్‌లోని న్యాక్ హైటెక్స్ గ్రౌండ్స్ వద్ద కార్పోరేట్ ప్రొఫెసనల్స్ ఫిట్ నెస్ , ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలినీ అవలంభించేలా ప్రోత్సహించడానికి ఆదివారం ఫ్లాగ్ షిప్ కార్పోరేట్ గ్రీన్‌థాన్‌ను నిర్వహించారు. సీఐఐతెలంగాణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో 3కె, 5కె, 10కె విభాగాలలో నడిచారు. గ్రీన్‌థాన్‌లో గెలుపొందిన విజేతలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల విలువైన హెల్త్ కార్డులను ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బొలినేని భాసక్ర్‌రావు, టీఐఈ హైదరాబాద్ ప్రెసిడెంట్ మిస్ రషిదా అడేవాలా పాల్గొన్నారు.

100 రోజుల టీఎస్ఆర్టీసీ పండుగ ఆరంభం



సంబరాల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎం ఎం మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: పర్వదినాలను పురస్కరించుకొని 100 రోజుల టీఎస్ఆర్టీసీ పండుగను ఆరంభించినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, అధికారులతో కలిసి ఆయన ఆదివారం పండుగ సంబరాల పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలపై వారికి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలు వరుసగా 100 రోజులలో ఉన్నాయని, ఈ సందర్భంగా సకాలంలో ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చే బాధ్యత మనదేనన్నారు. హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రశాంత్, సూపరింటెండెంట్ హెచ్ లక్ష్మీబాయి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న అలిండియా శారీమేళా, దసరా, బతుకమ్మ ఉత్సవాలలో సందర్శకులు పాల్గొని చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన చీరలు, గృహాలంకరణ ఉత్పత్తులు మగువలను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఒడిస్సి, కథక్, కూచిపూడి నృత్యాంశాలు సందర్శకులను అకట్టుకున్నాయి. బెంగుళూరు నుంచి వచ్చిన కళాకారులు జయిత దత్త శిష్యబృందంచే ప్రదర్శించిన కథక్ నృత్యం సందర్శకులను ఆకట్టుకుంది. చైత్ర దాసేగౌడ శిష్యబృందం ఒడిసి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చావళి భాలత్రిపుర సుందరి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. అమ్మవారి రూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462